జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





శనివారం, జూలై 25, 2026 పేజీలు : 7

## ప్రాజెక్టుల భూసేకరణ

# వేగవంతం చేయాలి

### గద్వాల కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల జూలై 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):** ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,ఆ దిశగా జిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నెట్టెంపాడు,గట్టు ఎత్తిపోతల పథకాలు,మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ పురోగతిపై రెవెన్యూ,సర్వే,ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టులకు సంబంధించి

## పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



నాగర్ కర్నూల్ : జులై 24 (ప్రజా జ్యోతి) నాగర్ కర్నూల్ మండలం పెద్ద ముద్దునూరు శ్రీ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎం.పీ.పీ.ఎస్ పాఠశాల నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగం అభివృద్ధి పట్ల తమ కట్టుబాటును చాటి ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు మునిసిపల్ చైర్మన్ సునీంద్ర కుమార్,కౌన్సిలర్లు,మండల అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలి

### - ఎన్యూమరేషన్ పత్రాలు బీఎల్‌వోకు అందజేసిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



## ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత

# అవగాహన కల్పించాలి

### - జిల్లా అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు



## ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలే లక్ష్యం

### కోయిలకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూలై 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ దరావత్ జానకి పేర్కొన్నారు. శుక్రవారం కోయిలకొండ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ నిర్వహణపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని



# ఎస్ఐఆర్ ప్రక్రియకు బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలి

మహబూబ్‌నగర్, జూలై 24 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసేందుకు బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వోలు) బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి సహకారం అందించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీలోని తన నివాసంలో బీఎల్‌వోకు తన ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు కావాలని అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను అత్యంత బాధ్యతగా నిర్వహిస్తూ ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. బీఎల్‌వోలకు నేరుగా ఎన్యూమరేషన్ పత్రాలు అందజేయలేని వారికి ఎన్నికల సంఘం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. ఉపాధి, ఉద్యోగం, విద్య తదితర కారణాలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించి, వారి అర్హతను పరిశీలించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గ్రామాల్లో కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, వివాహం కారణంగా చిరునామా మారిన మహిళలు, ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి నమోదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత

# అవగాహన కల్పించాలి

మహబూబ్‌నగర్, జూలై 24 (ప్రజా జ్యోతి బ్యూరో): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీలు) విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ మేరకు అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు. ముందుగా పాఠశాల యూనిఫాంల కుట్టింపు పురోగతిపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, విద్యాశాఖ, డీఆర్‌డీఓ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టిస్తున్న యూనిఫాంల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. యూనిఫాంల నాణ్యతను నిర్ధారించే బాధ్యత సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులదేనని స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా యూనిఫాంలను సకాలంలో విద్యార్థులకు అందజేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో ఈ వానాకాలంలో సుమారు 89,584 ఎకరాల్లో వరి సాగు తగ్గే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సంయుక్తంగా కంటింజెన్సీ ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారులకు సుమారు ఐదు వేల ఎకరాల ప్రత్యామ్నాయ పంటల లక్ష్యాన్ని నిర్దేశించి, ఆ లక్ష్య సాధనకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఇంతకుముందు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పాఠశాల యూనిఫాంల కుట్టింపు, పంపిణీ ఏర్పాట్లు, అలాగే ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఆగస్టు 15 నాటికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం ఇద్దరు మాస్టర్ క్లాత్ కట్టర్లను గుర్తించి నియమించాలని, వస్త్రాల కట్టింగ్ ప్రక్రియను వేగవంతం చేసి టైలర్లకు అప్పగించాలని సూచించారు. యూనిఫాంల కుట్టింపు, పంపిణీ ప్రక్రియను జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలపై రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, అవసరమైన విత్తన నిల్వలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని, వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ సూచనలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా ప్రధాన ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి గోవినాయక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్, విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాజెక్టుల భూసేకరణ

# వేగవంతం చేయాలి

ప్రాథమిక నోటిఫికేషన్ పూర్తై అవార్డు దశలో ఉన్న భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలాల వారీగా,గ్రామాల వారీగా చేపట్టాల్సిన భూసేకరణ పనులపై సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ,ఇరిగేషన్,రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్త తనిఖీలు(జాయింట్ ఇన్‌స్పెక్షన్)త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ విషయంలో సంబంధిత గ్రామాల్లో మరోసారి గ్రామసభ నిర్వహించి ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి అధికారులతో తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించాలని అన్నారు.పునరావాస(ఆర్ అండ్ ఆర్)గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు త్వరితగతిన పంపించాలని ఆదేశించారు.అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి నిబంధనల ప్రకారం గ్రామసభలు నిర్వహించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.జూరాల,నెట్టెంపాడు ప్రాజెక్టుల పరిసర ప్రాంతాల్లోని ఇరిగేషన్ రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి శాఖ ముందుకు వచ్చిందని,ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇరిగేషన్ శాఖ పంపిస్తే ప్రభుత్వానికి నివేదిస్తానని కలెక్టర్ తెలిపారు. భూసేకరణ పురోగతిపై తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని,అధికారులు శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ,ఆర్డీవో శ్రీనివాసరావు,ఇరిగేషన్ ఈఈలు సంజీవ్ ప్రసాద్,శ్రీనివాసులు,ఆయా మండలాల తహసీల్దార్లు,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలే లక్ష్యం

రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు, శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నేరాల నియంత్రణ, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో కోయిలకొండ ఎస్ఐతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధురాలు హత్య కేసులో నిందితులు అరెస్టు

**సొమ్ములు రికవరీ**

**నిందితులను రిమాండ్ కు తరలింపు**

**డి.ఎస్.పి బుర్రి శ్రీనివాస్**

పెద్దకొత్తపల్లి జులై 24 మండలంలోని దేవల్ తిరుమలాపూర్ గ్రామంలో ఈనెల 15వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెంది శివమ్మ కనిపించిన సంఘటన కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరుగుతుందని డిఎస్పి బుర్రి శ్రీనివాస్ తెలిపారు.

పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డి.ఎస్.పి బుర్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ఇంటి నుండి వచ్చిన నడిపి నాగమ్మ 70 సంవత్సరాల వృద్ధురాలు కనపడకపోవడంతో 15వ తేదీన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం ప్రారంభించామనిఆయన తెలిపారు. నడిపి నాగమ్మ ప్రతిరోజు ఉదయం గ్రామంలోని కుంటి లక్ష్మి అదే విధంగా సాలె లక్ష్మమ్మ ఇంటి వద్ద సారా తాగేదని సారా తాగిన అనంతరం శివమ్మ తో మాట్లాడుతూ ఆమె ఇంటి వైపు వెళ్లినట్లు తెలిసిందని ఆయన అన్నారు. 16వ తేదీ ఉదయం సుమారు పది గంటల సమయంలో దేవల్ తిరుమలాపూర్ గ్రామ శివారులోని పెద్ద బండ సమీపంలోని పొదల్లో ఓ మహిళ మృతదేహం కుళ్లిపోయినట్లు ఉన్నట్లు కావాలి కురుమయ్య సమాచారం ఇవ్వడంతో మృతురాలి కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా మా అమ్మ శివమని గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు.నాగమ్మ మృతదేహాన్ని శివమ్మ పడవేసి తిరిగి మీ ఇంటికి వస్తుండగా చూసిన కేతనమని శివశంకర్ ఆ నువ్వు పడవేసిన మూట ఏమిటి అని ప్రశ్నించడంతో ఆమె కంగారుగా ఇంటికి వెళ్లడం జరిగిందని తెలిపారు. 24వ తేదీ ఉదయం ఏడు గంటల సమీపంలో శివమ్మ మీద అనుమానంతో ఆమెను పట్టుకొని పోలీసులు తీసుకువచ్చి విచారణ చేపట్టగా నిజాలు ఒప్పుకుందని నాతో పాటు అంజనమ్మ శివమ్మ కూతురు నందిని ఉన్నట్లు శివమ్మ ఒప్పుకోవడం జరిగిందని డిఎస్పి బుర్రి శ్రీనివాస్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతురాలపై ఉన్న9.2 గ్రాముల ఒక బంగారు పలకల గొలుసు 1.3 గ్రాముల బంగారు తాళిబొట్టు 0.5 గ్రాముల పుస్తెల గుండ్లు11.1 గ్రాముల బంగారు చెవుల గెంటీలు18.9 గ్రాముల వెండి చేతుల కడియాలు28.3 కాళ్ళ కడియాలు తీసుకున్నామని అట్టి సొమ్ములను నక్కలపల్లి గ్రామానికి వెళ్లే బాటలో తమ పొలం సమీపంలో వేపచెట్టు వద్ద గుంత తవ్వి పాతిపెట్టానని ఒప్పుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.సంఘటన స్థలానికి సి ఐ ఎస్ ఐ లు వెళ్లగా దాచిన సొమ్ములను నిందితులు తీసుకువచ్చి ఇవ్వడం జరిగిందని డిఎస్పి తెలిపారు.సమావేశంలో సీఐ శంకర్ ఎస్ఐ వి సతీష్ ఏఎస్ఐ పోలీసులు ఉన్నారు.



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం.. బీజేపీ నాయకుల అరెస్ట్

గండీడ్: రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు వికార్షబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో గండీడ్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, గండీడ్ మండల అధ్యక్షుడు కె. విజయ్ కుమార్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి నరహరి రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాకి నరేష్, శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నిరసన తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిరసనలో పాల్గొన్న బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన తమ నిరసనను అణచివేసేందుకు అరెస్టులు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం కాంగ్రెస్ పార్టీ





మానుకోవాలని, ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉందని వారు అన్నారు.

## కృష్ణ మండల హిందూపూర్ గాంధీ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

**కృష్ణా జులై 24 ( ప్రజా జ్యోతి)**

ఢిల్లీ లోని నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా జంతర్ మంతర్ లో విద్యార్థులు , యువత యొక్క ధర్నా లో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయిస్తున్న బిజెపి ప్రభుత్వం పై మరియు రాహుల్ గాంధీ ప్రియాంక , గాంధీ గారు మోడీ ఇంటి ముందు ధర్నా చేస్తుండగా వారిని అక్రమంగా అరెస్ట్ చేసిన సందర్భంగా ఈ రోజు కృష్ణ మండల హిందూపూర్ గ్రామ గాంధీ చౌరస్తాలో ధర్నా చేపట్టాం జరిగింది.

ధర్నా లో మా యొక్క డిమాండ్లు :

నీట్ పేపర్ లీక్‌పై పూర్తి స్థాయి, పారదర్శక దర్యాప్తు జరగాలి. దోషులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన వారిని కాపాడే ప్రయత్నాలు ఆపాలి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన నాయకులు, కార్యకర్తలపై పెట్టిన చర్యలను



ఉపసంహరించుకోవాలి. ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు , యువజన కాంగ్రెస్ అధ్యక్షులు , మాజి ఎంపీపీ , గ్రామాల సర్పంచులు , ఉప సర్పంచులు , కాంగ్రెస్ సీనియర్ నాయకులు , మైనారిటీ సెల్ నాయకులు , యువకులు , మండల కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నశించాలి బిజెపి ప్రభుత్వ వైఖరి నశించాలి రాజీనామా చేయాలి కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

# హెచ్‌డబ్ల్యూసీఎస్ గద్వాల అధ్యక్షుడిగా తిరుమల త్యాగరాజు ప్రమాణ స్వీకారం

## చేనేత కార్మికుల సంక్షేమం,సహకార సంఘం బలోపేతమే లక్ష్యమని వెల్లడి

గద్వాల,జూలై 24(ప్రజా జ్యోతి):చేనేత కార్మికుల సంక్షేమం,సహకార సంఘం బలోపేతం,ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలే తమ ప్రధాన లక్ష్యమని హెచ్‌డబ్ల్యూసీఎస్ (చేనేత సహకార సంఘం) నూతన అధ్యక్షుడు తిరుమల త్యాగరాజు అన్నారు. గద్వాల పట్టణంలోని స్వకులశాలి సమాజం కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవం చేనేత కార్మికుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తిరుమల త్యాగరాజు అధ్యక్షుడిగా,అబ్బ సత్తన్న ఉపాధ్యక్షుడిగా,దోర్రే శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా,పగడాకుల సత్యం కోశాధికారిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే కమిటీ సభ్యులుగా కర్లీ చంద్రశేఖర్,సంబారి హరిబాబు,సురా సవిత, కాడిగి రాము,సాక నారాయణమ్మతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి గద్వాల శ్రీ రాఘవేంద్ర సిల్క్ సొసైటీ అధ్యక్షుడు, ప్రియదర్శిని మహిళా సంఘం అధ్యక్షురాలు,బూడిదిపాడుకు చెందిన దివ్య చేనేత సహకార సంఘం అధ్యక్షుడు,హెచ్‌డబ్ల్యూసీఎస్ గట్టు అధ్యక్షుడు తదితరులు హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల త్యాగరాజు మాట్లాడుతూ,తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులు,చేనేత కార్మికులు,మద్దతుదారులు,మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన మొదటి బాధ్యత అని పేర్కొన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హత కలిగిన చేనేత కార్మికుడికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంపొందించడం,గద్వాల చేనేతకు మరింత గుర్తింపు తీసుకురావడం,సహకార సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కార్యవర్గ సభ్యులతో కలిసి సమిష్టిగా పనిచేస్తానని తెలిపారు. చేనేత కుటుంబాల సంక్షేమమే తమ కార్యాచరణకు కేంద్రబిందువని,కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. నూతన కమిటీ బాధ్యతలు చేపట్టడంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. తిరుమల త్యాగరాజు నాయకత్వంలో గద్వాల చేనేత రంగం మరింత అభివృద్ధి చెందడంతో పాటు చేనేత కార్మికుల సంక్షేమానికి సంఘం విశేషంగా కృషి చేస్తుందనే ఆశాభావాన్ని సభ్యులు వ్యక్తం చేశారు.



## వెన్నచేడ్‌లో ఘనంగా శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు



గండీడ్, జూలై 24 (ప్రజాజ్యోతి): గండీడ్ మండలంలోని వెన్నచేడ్ గ్రామంలో శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత్ చెన్నయ్య అమ్మవారికి భక్తిపూర్వకంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, గ్రామం ఎల్లప్పుడూ శాంతి, సుభిక్షాలతో కళకళలాడాలని అమ్మవారిని ప్రార్థించారు.

ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు. కార్యక్రమం భక్తి పారవశ్యంతో, సంప్రదాయబద్ధంగా కొనసాగింది.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**కృష్ణా జులై 24 (ప్రజా జ్యోతి)**

కృష్ణా మండలం లోని మాజీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం టైరోడ్ చౌరస్తా లో జిల్లా కృష్ణా మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ప్రయాణికులకు, ఆటో కార్మికులకు, మహిళలు కు, పండ్లు, బ్రెడ్లు, మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ కేటీఆర్ ప్రజాసేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేటీఆర్ ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో ఉండలని కోరుతూ ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల నాయకులు శివరాజ్ పాటిల్, బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు వాకిటి సంతోష్ మాజీ సర్పంచ్ అంబ్రేష్, ముడుమాల్ సర్పంచ్ కే బాల్ రాజ్,రవి,వై తిమ్మప్ప, బి దేవప్ప, సి సురేష్, జాంబయ్య, మెకానిక్ అంజి,+ శివాప్ప, తదితరులు పాల్గొన్నారు

## ఇంకుడు గుంతలను వినియోగించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలి

**మల్దకల్,జూలై 24(ప్రజా జ్యోతి):**

జోగులాంబ గద్వాల జిల్లా పెద్దపల్లి గ్రామంలో ఇంకుడు గుంతల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలకు ముగ్గులు వేసి వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మాట్లాడుతూ,ప్రతి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. పెద్దపల్లి గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్,ఆశా వర్కర్ ఈరమ్మ పాల్గొన్నారు.



# దళితులకు 15% రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలి

## బీజేపీ ఎస్సీ మోర్చ డిమాండ్

మహబూబ్‌నగర్, జూలై 24 ( ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అన్ని ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, రాష్ట్ర ప్రభుత్వానికి తమ విజ్ఞప్తిని నివేదించాలని కోరింది. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని, అదే విధానాన్ని రాజకీయ రంగంలోనూ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.
దళిత జనాభాకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారి సమస్యలు ప్రభుత్వ దృష్టికి మరింత సమర్థవంతంగా చేరుతాయని, సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల సాధికారత లక్ష్యాల సాధనకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థలు,



ఇతర ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు మిట్టమిది నాగరాజు, రాష్ట్ర నాయకుడు దళితరత్న ఎడ్ల కృష్ణయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పాలమూరులో జనసేన సైలెంట్ ఆపరేషన్..

### – ఆగస్టు 1న రాష్ట్ర అధ్యక్షుడి నేతృత్వంలో భారీ ర్యాలీ



మహబూబ్‌నగర్, జూలై 24 ( ప్రజా జ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు కార్యాచరణను వేగవంతం చేశాయి. ఇందులో భాగంగా ఆగస్టు 1న తెలంగాణ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు నేమూరి శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్‌లో విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొననున్నారు.
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, పార్లమెంట్ కోఆర్డినేటర్ మేడ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నారు. రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ ప్రతినిధులు, వీరమహిళలు, జనసైనికులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మేడ రామకృష్ణ పార్టీ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారని, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకురావడంతో పాటు వివిధ వర్గాల నాయకులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ సమావేశం ద్వారా పాలమూరులో జనసేన పార్టీ ప్రజాబలం, సేవా సంకల్పాన్ని చాటిచెప్పడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా పోరాటాలు చేపడతామని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.
శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మేడ రామకృష్ణతో పాటు వంగా లక్ష్మణ్ గౌడ్, పి.ఆర్. రాఘవేందర్, ముకురాల కృష్ణ, మణికంఠ గౌడ్, రవీందర్ గౌడ్, శ్రీవల్లి, భరద్వాజ్, బాబు జగ్జీవన్, డాక్టర్ వి.వి. చారి, ముత్యాల గౌరవ్, ఎద్దుల శ్రీనివాసులు, బాల్‌రాజ్ యాదవ్, కనకదుర్గ, నరేష్, రవి, రామరాజు, కిషోర్‌లాల్, శివ తదితర నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థులు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

# నర్వ చాపల చెరువు సమస్యపై మంత్రిని కలిశిన నర్వ గ్రామస్థులు

## ప్రజలకు ఇబ్బంది కలిగితే తక్షణమే చర్యలు తీసుకోవాలి

## సంబంధిత శ్యాకా అధికారులకుమంత్రి వాకిటి ఆదేశించారు





నర్వ జూలై 24 ప్రజాజ్యోతి
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో చాపల చెరువు నిర్మాణం వల్ల గ్రామ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని శుక్రవారం నర్వ గ్రామ పెద్దలు, యువకులు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లారు.
ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించి, చాపల చెరువు నిర్మాణం వల్ల నర్వ పెద్ద చెరువుకు వచ్చే సహజ నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందని వివరించారు. దీనివల్ల నర్వతో పాటు ఉందేకోడ్, యాంకి గ్రామాల రైతులకు కూడా ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు.
గ్రామస్తుల సమస్యను విన్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్పందిస్తూ.. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా నిర్మాణం చేపట్టినట్లయితే సంబంధిత వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ మురళికి సూచించారు. అనంతరం గ్రామ ప్రజలు మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ మురళిని కలిసి వినతిపత్రం సమర్పించారు. చాపల చెరువు నిర్మాణం వల్ల కలిగే ఇబ్బందులను ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన అదనపు డైరెక్టర్ మురళి సమస్యపై తక్షణమే చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.
ఒక్కరి ప్రయోజనం కోసం మూడు గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు, యువకులు అధికారులను కోరారు.
ఈ కార్యక్రమంలో నర్వ గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## ఆషాఢ శుక్రవారం సందర్భంగా వాసవి మాతకు గోరింటాకుతో ప్రత్యేక అలంకరణ



మల్దకల్,జూలై 24(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారికి గోరింటాకుతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాస శుక్రవారం సందర్భంగా శ్రీ వాసవి మాత విగ్రహాన్ని గోరింటాకుతో సుందరంగా అలంకరించినట్లు దేవస్థాన పట్టణ అధ్యక్షుడు మనసాని నాగరాజు తెలిపారు. ఈ ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.

## పేపర్ లీకేజీలపై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు



వనపర్తి, జూలై 24 (ప్రజాజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు, వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ పిలుపు మేరకు శుక్రవారం వనపర్తి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో పలు కళాశాలలు, విద్యాసంస్థల వద్ద నిరసన చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బీ. శ్రీకాంత్, బీజీవీఎస్ నాయకుడు శివ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ బి. మల్లేష్, కో–కన్వీనర్ డి. వీరన్న నాయక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దినేష్, గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వంశీ, విద్యార్థి సంఘాల నాయకులు కుమార్, భరత్, హరీష్, సంతోష్, వెంకటేష్, ఉదయ్, మహేందర్, అనిల్, శివ, అబ్రార్, చరణ్, ఎం.డి. నబీల్, భాను, నరేష్, శ్రీకాంత్, కార్తీక్, కిరణ్, రాజేష్ పాల్గొన్నారు.

## గిరిజన బాలికల హాస్టల్ మంజూరు చేయాలి:

గద్వాల,జూలై 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గిరిజన విద్యార్థినుల కోసం ట్రైబల్ (గిరిజన) బాలికల హాస్టల్‌ను వెంటనే మంజూరు చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి ఉన్నత విద్య కోసం గద్వాలకు వచ్చే గిరిజన విద్యార్థినులు సరైన వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సురక్షితమైన వసతి లేకపోవడంతో కొంతమంది విద్యార్థినులు చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థినులు ప్రైవేట్ హాస్టళ్లలో ఉండలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గిరిజన బాలికల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన ట్రైబల్ బాలికల హాస్టల్‌ను తక్షణమే మంజూరు చేసి, ఈ విద్యా సంవత్సరంలోనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వినతిపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి,గిరిజన విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు చేపట్టాలని బీరెల్లి దానయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్,గంజిపేట కోళ్ల ఆంజనేయులు,రాజు,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డాకల్ మండలంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటన

- పొన్నకల్ గ్రామంలో రీ-సర్వే పనుల పరిశీలన
- తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష



మహబూబ్‌నగర్, జూలై 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ): మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం అడ్డాకల్ మండలంలో పర్యటించి, పొన్నకల్ గ్రామంలో జరుగుతున్న నాన్-కెడస్టల్ భూముల రీ-సర్వే పనులను పరిశీలించారు. అనంతరం అడ్డాకల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి, మీ సేవ, సాధారణ దరఖాస్తులకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లపై సమీక్ష నిర్వహించారు.
ముందుగా పొన్నకల్ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పొన్నకల్--రాచాల గ్రామాల మధ్య ఉన్న సరిహద్దు రేఖ (బౌండరీ లైన్) రీ-సర్వే ప్రక్రియను మ్యాప్ ద్వారా ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రాచాల, పొన్నకల్ గ్రామాల రైతులు, గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, గ్రామస్థుల సహకారంతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే సందర్భంగా తలెత్తే సాంకేతిక సమస్యలు, గ్రామస్తుల సందేహాలను వెంటనే నివృత్తి చేసి, పూర్తి అవగాహన కల్పిస్తూ ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఆలయం ముందు శిథిలావస్థకు చేరుకున్న కోనేరును పరిశీలించారు. కోనేరును పునర్నిర్మించాలని గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు చేసిన విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తరువాత అడ్డాకల్ తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి, మీ సేవ, సాధారణ దరఖాస్తులకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిశీలించిన కలెక్టర్, ముఖ్యంగా 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, అడ్డాకల్ తహసీల్దార్ కె. శేకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**మహబూబ్ నగర్ జూలై 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేటీఆర్ తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసి ప్రజాదరణ పొందిన నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని కేటీఆర్ నిర్ణయించుకోవడం ఆయన ప్రజల పట్ల ఉన్న బాధ్యతను చాటుతుందని అన్నారు. నేటి యువతకు కేటీఆర్ స్ఫూర్తిదాయక నాయకుడిగా నిలుస్తున్నారని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్. శివరాజ్, సీనియర్ నాయకులు కట్ట రవికిషన్ రెడ్డి, కిషోర్, శ్రీశైలం, శ్రీనివాస్ రెడ్డి, అహ్మద్దుద్దీన్, చిట్యాల సుధాకర్, రమేష్, అప్సర్ అబిద్, సమీర్, గణేష్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## వరి వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు



**చిన్నంబావి, జూలై 24 (ప్రజా జ్యోతి)**
ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశముండటంతో రైతులు అధిక నీటి అవసరమున్న వరి సాగుకు దూరంగా ఉండి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ సూచించింది. చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామ రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన అవగాహన గ్రామసభలో క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ బి. ప్రశాంత్ కుమార్ రైతులకు పలు కీలక సూచనలు చేశారు.ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశాలు తగ్గడంతో పాటు భూగర్భ జలాలు కూడా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వరి సాగు చేపడితే మధ్యలో నీటి కొరత ఏర్పడి పంట ఎండిపోయే ప్రమాదం ఉండటంతో రైతులు భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అందువల్ల వరికి బదులుగా కంది, పెసర, మినుము, అలసంద, జొన్న, సజ్జ, కొర్ర, రాగి, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు.మండల తహసీల్దార్ శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ. జూలై 31 నుంచి ఆగస్టు 15 వరకు వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున కనీసం 50 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేయాలని రైతులకు సూచించారు. తేమ కొరత ఉన్న పరిస్థితుల్లో కొత్తగా మొక్కజొన్న సాగు చేపట్టవద్దని, ఇప్పటికే సాగులో ఉన్న పంటల్లో తగిన తేమ ఉన్నప్పుడే యూరియా పైపూత వేయాలని తెలిపారు. కలుపు నివారణ, మల్చింగ్ వంటి యాజమాన్య చర్యలు చేపట్టడంతో పాటు పంటల్లో చీడపీడల ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి సాగు చేయాలని, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేస్తే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహా రెడ్డి, సర్పంచ్ కేతపాగ జయమ్మ, లక్ష్మయ్య ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ కల్వకోల్ ఉషనయ్య, మాజీ ఎంపీటీసీ కె. చంద్రయ్య, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, రైతులు ప్రభాకర్ రెడ్డి మొలకలపల్లి కురుమయ్య కురుమయ్య గొల్ల పాల్గొన్నారు.సర్పంచ్ కేతపాగ జయమ్మ మాట్లాడుతూ,వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సూచించిన ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలను రైతులు తప్పనిసరిగా పాటించి నష్టాలను నివారించుకోవాలని కోరారు.

## నీట్--సీబీఎస్ఈ అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

మహబూబ్‌నగర్, జూలై 24 (ప్రజా జ్యోతి బ్యూరో): నీట్--సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లేదా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రిని కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలో బంద్ నిర్వహించారు.బంద్‌లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల వద్ద విద్యార్థి సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. నీట్, సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్నట్లు పేర్కొంటున్న అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, పారదర్శకత లోపాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టడం వల్ల పరీక్షల వ్యవస్థ గందరగోళానికి గురైందని ఆరోపించిన నాయకులు, ఈ పరిస్థితులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. నీట్, సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్నట్లు పేర్కొంటున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను నిరసిస్తూ నిర్వహించిన బంద్‌కు విద్యార్థులు, యువజనులు, ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. రాజు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సీతారం, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు నందు, నాయకులు రాజు, రాజశేఖర్, పవన్, శేఖర్, శ్రీహరి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నర్వ జులై 24 ప్రజా జ్యోతి
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల లను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యకార, పాడి పరిశ్రమ,క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాను సారంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం. జరిగింది లబ్ధిదారులకు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో 662500/-చెక్కుల పంపిణీ చేసిన నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్
1) జక్కన్న పల్లి కోట్ల పార్వతమ్మ ూాజ 3,00,000/-లి2) జంగం రెడ్డిపల్లి ూ సత్య రెడ్డి 60000/
లి3) లంకాల దూల అరుణ్ కుమార్ 14000/4) బెక్కరపల్లి ఎం చంద్రకళ 32,500/-5) కుమార్ లింగంపల్లి గుడిబండ్ల నారాయణమ్మ 36,000/6) కొత్తపల్లి బోయ ఎర్రమ్మ 52,500/
7) జంగం రెడ్డిపల్లి బద్దిపల్లి అచ్యుత్ రెడ్డి 60000/8) లంకాల ు జ్యోతి లంకాల 52,500/-9) రాయికోడ్ ఖలీల్ పాషా 55000/
మొత్తాము శ్రీ 662500/-
ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,చెక్కుల లబ్ధిదారులు పాల్గొన్నారు..



# దేవుని మాన్యం భూములను గ్రామ ప్రజలకు అప్పగించాలి

## టీఆర్పీ నాయకుల డిమాండ్. టీఆర్పీ ఆధ్వర్యంలో భారీ ధర్నా. పోలీసులను, అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెత్తనం చేస్తే ఊరుకోం. పటేల్ వనజ

**విపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల కేంద్రంలోని 32 ఎకరాల దేవుని మాన్యం భూములను ఒకే కుటుంబం గుత్తాధిపత్యం నుండి విడిపించి, గ్రామ ప్రజలకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ పాల్గొన్నారు సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వందేళ్లుగా సాగుతున్న భూ దౌర్జన్యాన్ని తాము సహించేది లేదని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. గ్రామంలోని సుమారు 32 ఎకరాల దేవుని మాన్యం భూములను ఒకే సామాజిక వర్గానికి చెందిన గంగిరెడ్డి కుటుంబం అతి తక్కువ ధరకే లీజుకు తీసుకుని అనుభవిస్తోందని మండిపడ్డారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఈ భూములను సాగు చేసుకునే అవకాశం ఇవ్వకుండా, ప్రశ్నించిన వారిపై పోలీసులను మరియు అధికార బలాన్ని అడ్డుపెట్టుకుని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. దేవుని ఆస్తులు గ్రామ ప్రజలందరికీ చెందాలని, తక్షణమే ఈ భూములను పేదలకు సాగు నిమిత్తం అప్పగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని పటేల్ వనజ స్పష్టం చేశారు. ఈ నిరసన ధర్నాలో పార్టీ





రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్ సుశీల బిక్షపతి గౌడ్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్ యాదవ్ కోట్ల వాసుదేవ్ స్థానిక గ్రామ ప్రజలు, మహిళలు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా ఉప సర్పంచ్ ల అధ్యక్షునిగ ఎన్నికైన వీపనగండ్ల ఉప సర్పంచ్ మధుగని బాలపీరు యాదవ్

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. జిల్లా సలహాదారుగా తు ముకుంట ఉప సర్పంచ్ చిన్న రాంబాబు రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్, వివిధ గ్రామాల ఉప సర్పంచ్ ల సమక్షంలో ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్న వీపానగండ్ల మండలం ఉప సర్పంచ్ లు నేడు వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏం ఎన్ ఆర్ మినీ ఫంక్షన్ హాల్ లో వనపర్తి జిల్లా ఉప సర్పంచ్ ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉప సర్పంచ్ ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ ఉపాధ్యక్షులు గంధం పురుషోత్తం హాజరయ్యారు. ఈ యొక్క సమావేశంలో జిల్లా లోని వివిధ గ్రామాలకు చెందిన 50 కి పైగా ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు జరిగిన సమావేశంలో అందరి సమక్షంలో వనపర్తి జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులుగా




వీపనగండ్ల గ్రామ ఉప సర్పంచ్ బాలపిరు ని,గౌరవ సలహాదారునిగా తుముకుంట గ్రామ ఉప సర్పంచ్ చిన్న రాంబాబు ని మరియు జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు, వీపనగండ్ల మండలంలోని కల్వరాల, సంపత్ రావు పల్లి, బొల్లారం, ఫుల్గర్ చర్ల, వల్లభాపురం తాండ, కోర్లకుంట గ్రామాల ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి:విద్యార్థి సంఘాలు

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

గద్వాల జూలై 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పిడిఎస్యు,ఏఐఎస్ఎఫ్,విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం,కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు ఖండించారు. రాష్ట్ర విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శు క్రవారం జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్, ప్రభుత్వ,ప్రైవేట్ జూనియర్ కళాశాలలు,డిగ్రీ కళాశాలలు,ఇతర ఉన్నత విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు,విద్యార్థులపై జరుగుతున్న నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై లాఠీచార్జ్ చేయడం,కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేయడం కేంద్ర ప్రభుత్వ అహంకార వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని,లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై చర్యలు







తీసుకోవాలని, దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు హాలీం పాషా,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భరత్,ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్,పిడిఎస్యు జిల్లా కార్యదర్శి హరీష్,యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి,ప్రవీణ్,రాజు యాదవ్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

**కల్వకుర్తి, జూలై 24 ( ప్రజా జ్యోతి ) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్వకుర్తి మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 2026 – 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ విద్యార్థినీలకు ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ లో 5 సీట్లు,ఎంపీసీ లో 5 సీట్లు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 2 సీట్లు కలవు, అలానే క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థినీలకు ఇంటర్ పథ్రమ సంవత్సరం బైపీసీ లో 1 సీటు, ఎంపీసీలో 1 సీటు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, వైద్య సదుపాయం అందిస్తున్నామని చెప్పారు. అలాగే అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీలు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో నేరుగా కల్వకుర్తి మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో మరింత సమాచారం కోసం ఈ నెంబర్ ను 7207998974 సంప్రదించగలరని తెలిపారు.

# వర్షాకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## డీఎంహెచ్ఓ డా.సంధ్యకిరణ్మయి

**మల్దకల్ జూలై 24(ప్రజా జ్యోతి):**

వర్షాకాలంలో డెంగీ,మలేరియా,వైరల్ జ్వరాలు, టైఫాయిడ్,డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)డా.సంధ్యకిరణ్మయి సూచించారు. శుక్రవారం మల్దకల్ మండల కేంద్రంలో నిర్వహించిన”పొడి దినం”అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ నెల 6వ,తేదీ నుంచి ఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.రాజు ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక జ్వర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించి వివరాలు సేకరిస్తున్నారని,అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు,ఏరియా ఆసుపత్రులు,జిల్లా ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరీక్షలు,చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జ్వరం మూడు రోజులకంటే ఎక్కువ కొనసాగితే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి డెంగీ పరీక్షలు చేయించుకోవాలని,అవసరమైతే మలేరియా పరీక్షలు కూడా నిర్వహించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడడం, నీటి నిల్వ పాత్రలకు మూతలు వేయడం,దోమతెరలు వినియోగించడం,పూర్తి శరీరాన్ని కప్పే దుస్తులు ధరించడం,కాచి చల్లార్చిన నీరు తాగడం,పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. వర్షంలో తడిసిన అనంతరం జ్వరం,దగ్గు,జలుబు,గొంతునొప్పి తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆయాసం,అధిక జ్వరం,వాంతులు,విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.”చికిత్స కంటే నివారణే మేలు”అనే సందేశంతో ప్రతి మంగళవారం,శుక్రవారం”పొడి దినం”పాటిస్తూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమలు,ఈగలు పెరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎంహెచ్ఓ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.ప్రసూన రాణి,డీపీహెచ్ఎన్ఓ వరలక్ష్మి,స్థానిక వైద్యాధికారులు,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# డెంగ్యూ నియంత్రణకు 'ఫ్రైడే--డ్రై డే'ను సమర్థవంతంగా నిర్వహించాలి

### - అమిస్తాపూర్‌లో కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డా. ఏ. శ్రీనివాసులు

మహబూబ్‌నగర్, జూలై 24 ( ప్రజా జ్యోతి బ్యూరో): దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. ఏ. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు నిర్వహిస్తున్న 'ఫ్రైడే--డ్రై డే' కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న 'ఫ్రైడే--డ్రై డే' కార్యక్రమం ప్రధాన ఉద్దేశం దోమల సంతానోత్పత్తిని పూర్తిగా అరికట్టడమేనని తెలిపారు. ఇందుకోసం ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నిల్వ నీటిని తొలగించడం, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. ప్రజలు తమ ఇళ్లలో లేదా పరిసరాల్లో ఉపయోగం లేని పాత డబ్బాలు, టైర్లు, పూల కుండీలు, కొబ్బరి బొండాలు వంటి వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని సూచించారు. తాగునీటి పాత్రలు, ఓవర్‌హెడ్ ట్యాంకులకు తప్పనిసరిగా మూతలు ఉంచాలని, ఇళ్ల చుట్టూ ఉన్న చిన్న



నీటి గుంతలను మట్టితో పూడ్చివేయాలని చెప్పారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి వారం ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది కలిసి ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డా. శివకాంత్, భూత్పూర్ వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సంఘ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



### జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక..
### ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి

కల్వకుర్తి జూలై 24 (ప్రజా జ్యోతి):కల్వకుర్తిలో భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సంఘ్ జనరల్ బాడీ సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు మాట్లాడుతూ, భారతీయ జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఏజెంట్ల సంక్షేమం, సేవా నిబంధనల మెరుగుదల, పెండింగ్ సమస్యల పరిష్కారంపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

బీఎంఎస్ రాష్ట్ర ఇన్సూరెన్స్ విభాగం జోన్ కార్యదర్శి బాలస్వామి మాట్లాడుతూ, ఎల్ఐసీ ఏజెంట్ల హక్కుల పరిరక్షణకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.

ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు చర్యలు చేపడతామని, అవసరమైతే ఎల్ఐసీ యాజమాన్యం, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో కూడా ప్రస్తావించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

సంస్థ అభివృద్ధితో పాటు ఏజెంట్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, సేవా భద్రత, ప్రోత్సాహకాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో తీర్మానించారు.

ఈ సందర్భంగా కల్వకుర్తి యూనిట్ నూతన అధ్యక్షుడిగా సురేష్ గౌడ్, వర్కింగ్ అధ్యక్షుడిగా ఎం.డి. దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా నిరంజన్, కోశాధికారిగా జంగయ్య బాధ్యతలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో బీఎంఎస్ అఖిల భారత కోశాధికారి బి. జగదీష్ కుమార్, అఖిల భారత కార్యదర్శి కె. సత్యనారాయణ రెడ్డి, జోనల్ వర్కింగ్ అధ్యక్షుడు బి. సంపత్ రావు, జనరల్ కార్యదర్శి ఎం. బాలస్వామి, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు వెంకటయ్య, జనరల్ కార్యదర్శి రంగ భాను ప్రకాష్, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు కె. బుచ్చిరెడ్డి, పదవీ విరమణ పొందిన శాఖ మేనేజర్ హనుమండ్లు, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, జంపుల కృష్ణయ్య, వాగుల్దాస్, నిరంజన్, కల్వ ఆంజనేయులు, తిరుపతయ్య యాదవ్, ఎం సుధాకర్ ,దుగ్గి అశోక్, కొరివి సురేష్, తిమ్మయ్య, బత్తుల శీను, బండారు జంగయ్యతో పాటు అచ్చంపేట, కల్వకుర్తి మరియు రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, ఎల్ఐసీ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతంలో బి.ఎల్.ఏ ల పాత్ర కీలకం

### -ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : జులై 24 (ప్రజా జ్యోతి)**

పార్టీ బలోపేతంలో బి.ఎల్.ఏ ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి అన్నారు.శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బి.ఎల్.ఏల సమావేశంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని పార్టీ బలోపేతంలో,బూత్ స్థాయి సంస్థాగత నిర్మాణం,ఓటర్ జాబితా సవరణ,ప్రజా సమస్యల పరి ష్కారానికి దిశా నిర్దేశం చేసి ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాడంలో బి.ఎల్.ఏల పాత్ర కీలకమని ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను చేరవేసి పార్టీ విజయానికి కార్యకర్తలు సమిష్టిగా కృషిచేయాలని అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్,మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,బి ఎల్ ఏ లు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి

### మండల వ్యవసాయ అధికారి రాధ

**వడ్డేపల్లి జూలై 24(ప్రజా జ్యోతి):**

వడ్డేపల్లి మండలంలోని జిల్లేడుదిన్నె గ్రామంలో శుక్రవారం సర్పంచ్ సువర్ణ,వెంకటేశ్వరరెడ్డి,పంచాయతీ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన మండల.వ్యవసాయ అధికారి జె.రాధ రైతులకు ఎల్‌నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితులు,ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం లేదా అసమానంగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఖరీఫ్ సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు వివరించారు.అలాగే పంటల ఎంపిక,నాణ్యమైన విత్తనాల వినియోగం,నీటి సంరక్షణ పద్ధతులు,పంటల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.వాతావరణ శాఖ విడుదల చేసే సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ,వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.గ్రామసభలో రైతులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోగా,అధికారులు తగిన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) నాయుడు,ఏఎన్ఎం వెంకటేశ్వరి,గోవర్ధన్ రెడ్డి, గాంధీ రెడ్డి,సుధాకర్ రెడ్డి,చక్రి రెడ్డి,వడ్డే శ్రీను,కృష్ణతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

